నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మూసాపేట: పవర్‌నగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ భీమలింగప్ప తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కూకట్‌పల్లి వై జంక్షన్, మూసాపేట బస్టాప్, పవర్ నగర్, శివశక్తి నగర్, టి. అంజయ్యనగర్, వసుంధర హాస్పిటల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పంచశీల స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం



మూసాపేట: మూసాపేటలోని పంచశీల ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవం, ప్రపంచ అక్షరాస్యత దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాదాలు కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బేతేనియ ప్రార్థన మందిరం వార్షికోత్సవం



బేతేనియ చర్చి వార్షికోత్సవంలో హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని తులసినగర్ కమ్యూనిటీ హాల్‌లో బేతేనియ ప్రార్థన మందిరం 25వ వార్షిక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి చర్చి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రెవ ఏఆ సీయోను రాజు, ప్రసంగీకులు జి.సముయేలు, పాస్టర్ ఆర్‌పి.దాస్, బ్రదర్ రాయుడు, కిరణ్ అండ్ టీం, నిఖిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కూల్చిన చోటే మళ్లీ నిర్మాణాలు

జగద్గిరిగుట్ట: అధికారులు కూల్చిన కొద్ది రోజుల్లోనే మళ్లీ నిర్మాణం చేపట్టి సవాలు విసురుతున్నారు. జగద్గిరిగుట్ట రింగ్ బస్తీలో ఉన్న అనాథాశ్రమ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలపై గత నెల 19న 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించి నిర్మాణాలు కూల్చారు. కాగా మళ్లీ అదే స్థలంలో తిరిగి నిర్మాణాలు చేపట్టడం విశేషం. వినాయక చవితి పనులలో అధికారులు బిజీ ఉండటం.. నిఘా లోపించడంతో మళ్లీ నిర్మాణాలు చేపట్టారు. కాగా ఓ కుటుంబం పండుగ రోజు గృహ ప్రవేశం కూడా జరుపుకున్నట్లు సమాచారం. సంబంధిత శాఖ అధికారులు వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేయాలి



బాలానగర్: కాంగ్రెస్ బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్నకుమార్, కాంగ్రెస్ నాయకులతో తరలివెళ్లి బాలానగర్‌లోని సివిల్ సప్లై ఏఎస్‌ఓ అధికారికి వినతి పత్రం అందజేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని అర్హులైన నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రేషన్ కార్డులను సకాలంలో ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డుల దరఖాస్తులను పరిశీలించి వెంటనే వారికి మంజూరు చేయాలని కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పరెడ్డి, డివిజన్ జనరల్ సెక్రటరీ మహేందర్, హేమంత్, ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు శివ, సోషల్ మీడియా కన్వీనర్ గజానంద్ శేఖర్, యూత్ కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్ హర్షద్‌సోను, నాగరాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఓల్డ్ బోయిన్‌పల్లి: విద్యార్థులకు పాఠాలు నేర్పే అధ్యాపకుల పాత్ర కీలకమని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. సమాజంలో గురువు లేకపోతే న్యాయం, భద్రత, విద్య, వైద్యం ఏమీ ఉండవని అన్నారు. లైన్స్‌టౌన్ కాలనీలోని శ్రావణ దివ్యాంగుల పాఠశాలలో అభ్యుదయ ట్రస్ట్ చైర్మన్ జీవీ రమణ బాలమ్మ ఆధ్వర్యంలో సోమవారం ఆయన ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం సాగేదెలా..?

మార్తాండనగర్‌లో గుంతలమయంగా రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహనదారులు
- ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు



రోడ్డంతా బురద, చెత్తాచెదారంతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

చందానగర్: కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్ బస్తీలోని రోడ్డుపై మట్టి, చెత్త, బండ రాళ్లు వేయడంతో గుంతలు ఏర్పడ్డాయి. చుట్టు పక్కల పలు బస్తీ వాసులు రాత్రి సమయాల్లో ఇష్టానుసారంగా చెత్తాచెదారాన్ని తీసుకువచ్చి రోడ్డుపై వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క నాలా విస్తరణ చేశారు. కానీ రోడ్డు వేయడం లేదని ఇంజినీరింగ్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదంటూ బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. ఆ రోడ్డు మీద నుంచి వెళ్లాలంటే సాహసం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డుపై వాహనదారులు, పాదచారులు నడవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్తతో దోమల బెడద వల్ల విష జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ పనులకు ప్రత్యేక నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

- మార్తాండనగర్ బస్తీలోని అంతర్గత రోడ్లు మాత్రం సీసీ రోడ్డు వేశారు. ప్రధాన రోడ్డు వేయడం మరిచారు. వెంటనే సీసీ రోడ్డు వేయాలి
- రోడ్డుపై మట్టి, చెత్త కుప్పలతో దుర్గంధంగా మారడంతో స్థానికుల సమస్యలు వర్ణనాతీతం.
- రోడ్లపై పేరుకుపోతున్న చెత్తాచెదారంతో దోమల బెడద ఎక్కువతుందని దీంతో విష జ్వరాలు వస్తున్నాయి. ఎంటమాలజీ సిబ్బంది రోడ్లపై బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలి.
- వీధిదీపాలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నారు.
- మార్తాండనగర్ నుంచి ప్రధాన రోడ్డుకు కలిసే ఈ రోడ్డు అభివృద్ధి చేయాలి.
- పారిశుద్ధ్య కార్మికులు ప్రతి రోజు చెత్తాచెదారం తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలి.
- బస్తీలలోని ప్రధాన చౌరస్తాలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.
- రాత్రి సమయాల్లో రోడ్డుపై వెళ్లాలంటే ఇబ్బందులు పడకుండా వీధిదీపాలు ఏర్పాటు చేయాలి.



గుంతల రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి..



మార్తాండనగర్ బస్తీలలోని అంతర్గత రోడ్లు సీసీ రోడ్లు వేశారు. కానీ ప్రధాన రోడ్డు వేయడం మరిచారు. సీసీ రోడ్డు వేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా గుంతల రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి.

\- ఇష్తికార్ అహ్మద్, మార్తాండనగర్



మార్తాండనగర్ బస్తీ ప్రధాన రోడ్డుపై పేరుకుపోయిన చెత్త కుప్పలు

చెత్త కుప్పలను ప్రతిరోజూ తొలగించాలి..



మార్తాండనగర్ బస్తీ చుట్టు పక్కల బస్తీలోని ప్రజలు చెత్తాచెదారం తీసుకువచ్చి రాత్రి సమయాల్లో రోడ్డుపై వేస్తున్నారు. నెలలు గడస్తున్నా పారిశుద్ధ్య కార్మికులు చెత్తను తొలగించడం లేదు. పారిశుద్ధ్య అధికారులు ప్రతిరోజూ చెత్తను తొలగించాలి.

\- సలీం, మార్తాండనగర్

ప్రధాని మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న మాధవరం కాంతారావు తదితరులు

కూకట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని సులభతరం చేస్తూ, పేద, రైతు, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకున్న సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ బీజేపీ బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో మోదీ ఫ్లెక్సీకి సోమవారం పాలాభిషేకం చేశారు. బీజేపీ కూకట్‌పల్లి అధ్యక్షుడు మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. తాజాగా జీఎస్టీ తగ్గింపు నిర్ణయంతో ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబానికి లాభం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యప్రకాష్‌రావు, జిల్లా కో కన్వీనర్ పద్మయ్య, కార్పొరేటర్ మహేందర్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, తిరుపతిరెడ్డి, ఆకుల రాములు, గోపి, బాబ్జీ గౌడ్, శ్రీనివాసచారి, శివచారి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా అన్నదానం



అన్నదానంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, సబిహా బేగం తదితరులు

బాలానగర్: మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే జష్నే మిలాద్ ఉన్ నబీ పండగలో భాగంగా సోమవారం బాలానగర్‌లో బీఆర్‌ఎస్ యువకులు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, అల్లాపూర్ కార్పొరేటర్ సబిహాబేగం హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీఆర్‌ఎస్ మేడ్చల్– మల్కాజిగిరి మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాజా, సీనియర్ నాయకులు మందడి సుధాకర్‌రెడ్డి, పంజా రాంచందర్ ముదిరాజ్, ఏలిజాల యాదగిరి, రాజేష్‌గౌడ్, నాగరాజ్ గౌడ్, నిర్వాహకులు మొహమ్మద్ సోఫి తదితరులు పాల్గొన్నారు.

ప్రగతినగర్ ప్రధాన సమస్యలపై సమావేశం



నిజాంపేట్: ప్రగతి నగర్ వ్యవస్థాపకులు, మాజీ ఉపసర్పంచ్ చల్లా సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పార్టీలు, అసోసియేషన్లకు అతీతంగా ప్రగతినగర్ ప్రధాన సమస్యలపై మున్సిపల్ కమిషనర్ ఎండీ సాబేర్ అలీతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రగతినగర్ ప్రధాన సమస్య శ్మశానవాటిక సమస్య, అంబిర్ సరస్సు ఆక్రమణలు, బతుకమ్మ ఘాట్ అభివృద్ధి పలు అంశాలపై చర్చించారు. శ్మశానవాటిక సమస్య కోసం ఎన్‌ఎంసీ కమిషనర్ ఆధ్వర్యంలో స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బతుకమ్మ ఘాట్‌లో బతుకమ్మ విగ్రహం, ప్రజలకు టాయిలెట్స్, స్టేజ్ సౌకర్యాలు కల్పించేలా నిర్ణయం తీసుకున్నారు.

- అనంతరం వినాయక చవితికి వర్షాకాలంలో అత్యవసర బృందాల ఏర్పాటు వారు కల్పించిన సౌకర్యాల వల్ల వినాయక నిమజ్జనం విజయవంతంగా ముగిసిందని ఈ సందర్భంగా కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్‌ఎంసీ మాజీ కార్పొరేటర్లు చిట్ల దివాకర్, చల్లా ఇంద్రజీత్‌రెడ్డి, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు అరవింద్ నాయుడు, తులసి దాస్, వెంకటరాజ్యం, ఉప్పు జస్వంత్, రమేష్, నబి, కామయ్య, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే చదువొక్కటే మార్గం

జగద్గిరిగుట్ట: సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే చదువు ఒక్కటే మార్గమని ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే అన్నారు. సోమవారం ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం పురస్కరించుకొని గాజులరామారం డివిజన్, అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందానికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువు చెబుతున్న గురువులను సత్కరించుకోవడం మన ధర్మమని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎల్లయ్య, సూర్యం, వలంటీర్ టీచర్ భాగ్యను ఆయన సన్మానించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

రంగారెడ్డినగర్: గురుమూర్తినగర్ జీడీహెచ్ తెలుగు ఉపాధ్యాయుడు సత్యనారాయణమూర్తిని సోమవారం రవీంద్రభారతిలో జరిగిన ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకల్లో సత్కరించారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్–320డి లయన్ కల్యాణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి మెమెంటోలు అందజేశారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంతో గురువుల కృషి ఎంతో ఉందన్నారు. వారిని సత్కరించడం సంతోషంగా ఉందని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ సత్యనారాయణ, ఇతర లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డుల దందాపై విచారణ జరపాలి

నిజాంపేట్: అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డుల దందాపై విజిలెన్స్ విచారణ జరపాలని ఆకుల సతీష్ సోమవారం అడిషనల్ కలెక్టర్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డుల వల్ల సంవత్సరానికి రూ.50లక్షలపై చిలుకు ఆదాయం వచ్చేదన్నారు. నూతన అడ్వర్‌టైజ్‌మెంట్ పాలసీ ఏర్పాటు చేస్తామని అప్పటి వరకు ఎలాంటి అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డులు ఏర్పాటు చేయొద్దని.. పాత అడ్వర్‌టైజ్‌మెంట్ రెన్యువల్ చేయొద్దని సీడీఎంఏ స్పష్టంగా సర్క్యులర్ విడుదల చేసిందన్నారు. దీంతో మూడు సంవత్సరాల నుంచి మున్సిపాలిటీలకు రూపాయి ఆదాయం రావడం లేదన్నారు. కానీ హోర్డింగ్స్ ఏర్పాటును అధికార పార్టీ నేత ఒకరు, మున్సిపల్ కమిషనర్లు ఏర్పాటు చేయడంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు.



మౌలిక సౌకర్యాల కల్పనే లక్ష్యం



గంగపుత్ర సంఘం కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజలకు వంద శాతం మౌలిక సదుపాయలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని, వారికి సేవ చేయడంలోనే సంతృప్తి కలుగుతుందని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తెలిపారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని గంగపుత్ర సంఘం కాలనీలో రూ.12 లక్షలతో వేస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని అన్నారు. తాను చేస్తున్న అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, అది ప్రజల నుంచి వస్తుండటంతోనే మరింత అభివృద్ధి సాధ్యమన్నారు. ఏఈ ఆశా, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, నాయకులు ఇర్ఫాన్, కార్యదర్శి మేకల హరినాథ్, కర్రె జంగయ్య, గడ్డం నర్సింగ్‌రావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న కరెంటు స్తంభాలను మార్చాలి

మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శివాజీనగర్‌లో శిథిలావస్థలో ఉన్న హైమాస్ట్ విద్యుత్ స్తంభం సమస్యను కార్పొరేటర్ సబిహాబేగం సోమవారం పరిష్కరించారు. కరెంటు స్తంభం ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆమెకు వివరించారు. స్పందించిన ఆమె వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులకు సమస్యను వివరించారు. కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పలు బస్తీల్లో ప్రమాదకరంగా స్తంభాలు ఉంటే వెంటనే మార్చాలని సూచించారు.

ఒక్కరోజు తీర్థ యాత్రకు సూపర్ లగ్జరీ బస్సు

మియాపూర్: మియాపూర్–1 డిపో పరిధిలో ఒక్కరోజు తీర్థయాత్ర నిమిత్తం ఈ నెల 13న శనివారం సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు మియాపూర్–1 డిపో మేనేజర్ మోహన్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. మహానంది, అహోబిళం (లక్ష్మీనరసింహ స్వామి ఆలయం), జోగులాంబ (శక్తిపీఠం), బీచుపల్లి (హనుమాన్ ఆలయం) దర్శించుకునేందుకు సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. శనివారం రాత్రి 8 గంటలకు మియాపూర్ నుంచి బస్సు బయల్దేరి ఆదివారం ఉదయం 5 గంటలకు మహానందికి చేరుకుంటుందని తెలిపారు. అదేవిధంగా ఆదివారం రాత్రి 11 గంటల వరకు మియాపూర్‌కు తిరిగి చేరుకుంటుందన్నారు. మిగితా వివరాల కోసం 8500309052, 7659029882 లలో సంప్రదించాలని తెలిపారు.

తెలంగాణలో సందర్శన..

మియాపూర్–1 డిపో పరిధిలో స్పెషల్ టూర్ ప్యాకేజీతో ప్రతి ఆదివారం సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మోహన్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఆదివారం తెలంగాణలోని ప్రసిద్ధ గణేష్ గడ్డ వినాయక ఆలయం, బీదర్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, రేజింతల్ వరసిద్ధి వినాయక ఆలయం, జరా సంఘం కేతకి సంగమేశ్వర ఆలయం, చిటకుల్ చాముండేశ్వరి ఆలయం, ఏడుపాయల వనదుర్గమాత ఆలయం దర్శన నిమిత్తం సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. మియాపూర్ నుంచి ప్రతి ఆదివారం ఉదయం 4 గంటలకు బయల్దేరి దర్శనానంతరం రాత్రి 11 గంటలకు మియాపూర్‌కు చేరుకుటుందని తెలిపారు. 30 మంది కంటే ఎక్కువగా భక్తులు ఉన్నచో ఏరోజైనా బస్సును నడపడం జరుగుతుందని తెలిపారు. మరిన్నీ వివరాల కోసం 98486 70640, 99592 26153 లలో సంప్రదించాలని తెలిపారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ



డీసీ శశిరేఖకు వినతిపత్రం అందజేస్తున్న రఘునాథ్‌రెడ్డి

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకమిషనర్ శశిరేఖ సర్కిల్ పరిధిలో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి 16 ఫిర్యాదులు వచ్చాయని వాటిలో టౌన్ ప్లానింగ్–09, రెవెన్యూ 01, ఇంజినీరింగ్–04, ఇతర సెక్షన్లకు–02 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వెంటనే ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మణికరణ్, ఏసీపీ నాగిరెడ్డి, ఇంజనీరింగ్ డీఈ దుర్గప్రసాద్, ఎంటమాలజీ, యూబీడీ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కనీస వసతులు ఏర్పాటు చేయాలని..

చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలో బతుకమ్మకుంట, ఈర్ల చెరువు వద్ద బతుకమ్మల నిమజ్జనం కోసం కనీస వసతులు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, బీజేపీ నాయకులు బోయిని మహేష్ యాదవ్ డీసీకి వినతిపత్రాలు అందజేశారు. అదే విధంగా హఫీజ్‌పేట్ డివిజన్‌లో పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీ, నాలా విస్తరణ తదతర సమస్యలపై వివరించారు. చందానగర్‌లోని భవానీపురం వీకర్ సెక్షన్ ఇంటి నెంబర్లు కేటాయించాలని ఆమెను కోరారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో మూడు ఫిర్యాదులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు మూడు ఫిర్యాదులు అందజేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 3 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఏఎంసీలు ప్రేమ్‌కుమార్, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లీశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

రేగులకుంట చెరువును పరిరక్షించాలి



జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న కసిరెడ్డి భాస్కర్ రెడ్డి

మియాపూర్: రేగులకుంట చెరువును పరిరక్షించాలని జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి జోనల్ కమిషనర్‌కు, శేరిలింగంపల్లి మండల తహసీల్దార్, చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ..హఫీజ్‌పేటలోని 150 సర్వే నంబర్‌లో ఉన్న రేగులకుంట చెరువు కబ్జాకు గురైందన్నారు. అభివృద్ధి పేరుతో చెరువు విస్తీర్ణాన్ని కుదించారన్నారు. రేగులకుంట చెరువును కొందరు ప్రైవేటు వ్యక్తులు కబ్జాచేసి అక్రమంగా అవినీతి పత్రాలను సృష్టించి జోనల్ కార్యాలయం నుంచి ఆ స్థలంలో భవన నిర్మాణానికి అనుమతులు పొందాలని తెలిపారు. పార్కులు, చెరువులు కబ్జాచేసిన స్థలాలకు కూడా కొందరు అధికారులు అనుమతులిస్తున్నారని, దీనిని నియంత్రించడంలో ఉన్నతాధికారులు విఫలం కావడం శోచనీయమన్నారు.

ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న దృశ్యం

చందానగర్: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని చందానగర్‌లోని న్యూ గుడ్ షెపర్డ్ చెవిటి, మూగ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ హాజరై విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మానవుని సర్వతోముఖాభివృద్ధి కేవలం విద్య తోటే సాధ్యమన్నారు. అక్షరాస్యత అనగా చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం లాంటివన్నారు. వ్యక్తిగత సాధికారత, సామాజిక పురోగతికి మూలస్తంభం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మెర్సి, అధ్యాపకులు శోభ, అంజలి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివరామకృష్ణ, అమ్మయ్య చౌదరి, పాలం శ్రీను, విష్ణు ప్రసాద్ పాల్గొన్నారు.